

# సీత

పసుపులేటి వెంకటరమణ

'నీ పేరేమిటి ?'

'సుజాత'

'నీకెన్నేళ్ళుంటాయ్ ?'

'పదహారొస్తుందనుకుంటా'

'ఏం చదువుతున్నావ్?

ఎందుకన్నట్లు ఒక్క క్షణం. చూసి, ఏదు చదువుతూ మానేశాను, అంది.

'ఎందుకని?' మళ్ళీ నేనే ప్రశ్నవేశాను.

కుడి చేతి వేళ్లను గుండ్రగా మడిచి నోటి దగ్గరగా పెట్టుకొని నవ్వింది.

'తిండి కోసం' అన్నట్టు.

'మరి నీకు చదువుకోవాలని లేదా?' అన్నాను.

'నాలుగు డబ్బులు మిగుల్చుకొని హిందీలో చేరాలని వుంది'—భవిష్యత్తులాంటి శూన్యంలోకి చూస్తూ అంది.

'ఎంతోరాముడు చెప్పాడా?' అంది. 'వాడెవడు' అందామనుకొని, ఈ అమ్మాయిని నా దగ్గరకు చేర్చిన రిక్షా వాడని గుర్తొచ్చిలేచి వెళ్ళి షర్టు జేబు నుంచి మూడు అయిదు రూపాయి కాగితాలిచ్చాను. సంతృప్తిగా వాటి వంక తను చూసుకుంటుండగా 'ఏం చేస్తావ్' అన్నాను.

'మా అమ్మకిచ్చేస్తాను' అంది.

'మీ నాన్నేం చేస్తాడు' మళ్ళీ ప్రశ్న వేశాను. పోయాడనే అర్థాన్ని సూచిస్తూ చేయి తిప్పింది. మాటల్లో వాళ్ళింటి ఆర్థిక స్థితిగతులూ, తనూ, తల్లీ సంపాదనే యింటిని గడిపేది అంటూ చెప్పింది.

'మీ అమ్మేం చేస్తుందీ?'

'ఇదే...' నవ్వుతోంది.

'నేను రెండో ఆట వదిలే వేళకి వెళ్ళిపోతాను'. అంది మంచం మీద వెల్లికిలా పడుకుంటూ—

ఓ పది నిమిషాలు గదిలో దీపం విశ్రాంతిగా కునుకు తీసింది.

లైటు వేసి, మంచం ప్రక్కన మోండా మీద కూర్చునిసిగరెట్ వెలిగించుకుంటుండగా 'టైమెంతైందీ?' అంది మత్తుగా

'పదకొండున్నర' అన్నాను మొదటిసారిగా ఆమె ప్రశ్నకు సమాధానం చెప్తూ.

'అంటే యింకో అరగంట పైగా టైముందన్న మాట' అంది.

పెద్దకళ్లు,సన్నటి చప్పిడి ముక్కూ, పసితనంపోనిబుగ్గలూ,తెల్లటి సుజాత ఏ'వున్న' కుటుంబంలోనో పుట్టివుంటే యువరాణిలా మెరిసి పోయేది.

ఒక్కక్షణంఆమెనీస్థితికి దించినసమాజం మీద పిచ్చికోపం వచ్చింది, ఆ వ్యవస్థననుసరించే వాళ్లలో నేనూ ఒకణ్ణన్న జ్ఞాపకం నన్ను సమాధాన పరిచింది.

'రేపే ఫీజు కట్టి పుస్తకాలు కొనిస్తాను, హిందీ ప్రేమీ మండలిలో జేరు 'అన్నాను'.

'అలాగే' మరి తిండి' అంది గుడ్డల వంక కూడా చూసుకుంటూ

'అవికూడాఎలాగోలా చూద్దాంలే'అన్నాను ఆలోచిస్తూ

'అయితే నన్ను పూర్తిగా వుంచేసుకుంటారా' మంచం మధ్యలో కూర్చుంటూ.

ఇంతలో తలుపుమీదసన్నగాచప్పుడైంది, తీసి చూశాను రాముడు.

పోజీ సర్దుకోని, డబ్బులు జాకెట్ లో దోపుకొని నవ్వుకుంటూ వెళ్ళి పోయింది. ఆలోచనల మధ్య నేను మిగిలిపోయాను.

రేపే ఏదో ఒకటి చేసి తననాకూపం నుండి బయటకు లాగాలని నిర్ణయించుకొని తలు పేసుకున్నాను.

బయట గలాటాగావుంటే కిటికీ తెరిచి రోడ్డువంక చూశాను. సుజాత యిద్దరు పోలీసుల మధ్య — ఒకడు జుట్టు పట్టుకొని గుంజుతూ 'ఏ కంపెనీ దానివే' గట్టిగా అడుగుతున్నాడు—

'ఈ టైంలో ఎక్కడా......వస్తున్నావ్' రెండోవాడి యికిలింపు ప్రశ్న. ఒక్కక్షణం కిటికీలోంచి నాకళ్ళల్లోకి చూసి నిశ్శబ్దంగా తలొంచుకొని వాళ్ళతో వెళ్ళిపోతోంది.

కిటికీమూసి వెనక్కి తిరిగాను.

చదువు చెప్పిస్తావా?, తిండి పెట్టిస్తావా? ముందు పోలీసులు ఆమెను పట్టుకున్న నేరంలో నీవంతు వప్పుకో చాలు? పరువు ప్రతిష్టల చొక్కాలాగూలో వున్న, నీ ఆదర్శాలు వల్లించడానికే,

ఆచరించే ధైర్యం నీకేది? నవ్వుతూ ప్రశ్నిస్తోంది నన్ను గోడకు వేలాడుతున్న నా 'నిశ్చల ఛాయా చిత్రం'!